షడ్జా మడ్జ - కాళిదాస శ్లోక పంచకమ్

మేళ్లచెర్వు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
తెనాలి.
9908163627

షడ్జా మడ్జ - కాళిదాస శ్లోక పంచకమ్

మేళ్లచెర్వు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
తెనాలి.
పీఠిక : **9908163627**

1) ప్రస్తుత శ్లోక పంచకము చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు ప్రచురించిన భోజకాళిదాస కథలనుంచి గ్రహించినది. ఈ పద్య పంచకము గూర్చి ఈ మధ్యన "Whats app" లో 'రంధి' మొదలయినది. వాటి అర్థ వివరణ గురించి అట్టివారు కొందరు నన్ను అడగటం తటస్థించినది. కాని 'Phone' లో ఆవిష్కృతమయిన పాఠములలో "త్రుటి" శాతం ఎక్కువగా నున్నది. నా దగ్గర ఉన్న పాఠము నష్టమయినది. అందువలన పునఃవ్యాఖ్యానించుటకు వీలయినంత శుద్ధ పాఠమునకై ప్రయత్నించితిని. మిత్రులు శ్రీ రావిమోహనరావు గారు, వి. లక్ష్మీనరసింహారావు గారు వీటికయి ప్రయత్నించిరి. ఈ శ్లోకములు సంస్కృతములో నున్న భోజప్రబంధము, భోజచరిత్రము లందులేవు. శ్రీ తాడేపల్లి పతంజలి గారివద్ద నుంచి శ్రీ రావి మోహనరావు గారి ద్వారా, ముళ్ళపూడి వెంకటేశ్వరశాస్త్రి గారి 'Smart Phone' ద్వారా ఈ భాగీంధి నాకు లభించినది. **కనుక వీరందరకు నా కృతజ్ఞతలు.** ఇందులో పతంజలి మా గురువు గారి సగోత్రుడు.

2) నేను 1970 ప్రాంతములో పెదకళ్లే పల్లిలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పేరుతోనున్న ఓరియంటల్ స్కూలులో ఉపాధ్యాయునిగా ఒక్క సంవత్సరము పనిచేసితిని. అప్పుడు మిత్రులు శ్రీ కె. అప్పారావు గారు స్కూలు వార్షికోత్సవ సందర్భముగా భోజ కాళిదాసీయ నాటకం వేయించారు. అందులో నేను "కాళిదాసుగా" పాత్ర ధరించాను. అదే నా తొలి చివరి నాటక వేషము. ఆద్యంతవదేకస్మిన్ - సంస్కృత నాటకమయినా గ్రామీణ ప్రేక్షకులను గూడా ఆకర్షించినది.

3) ఆ సందర్భమున శ్రీ అప్పారావు గారిద్వారా మాన్ స్క్రిప్ట్‌లో లభించిన ఈ శ్లోక పంచకమునకు నేను వ్యాఖ్యానము వ్రాసికొంటిని. అందులో రెండవ శ్లోకమయిన,

4) "షడ్జామడ్జ" వ్యాఖ్యానమునకు ఏ మాత్రము లొంగలేదు. మిగిలినవి లొంగినవి. వాటితోనే నాటకపాత్రను పూర్తిచేసినట్లు గుర్తు. ఆ వ్యాఖ్యాన పత్రములు గూడా నేడు దొరకలేదు. మరల క్రొత్తగా ఈ వ్యాఖ్యానమును రంగరించితిని. ఇప్పటికిన్ని ఈ 'షడ్జామడ్జ' కొరకరాని కొయ్యగానే ఉన్నది. అయినను అందలి అక్షర స్వారస్యమునకు అనుగుణముగా కొంత సవరించి వ్యాఖ్యానించితిని.

5) ఏమయినా ఇవి ప్రతివాదులయిన ఏకసంథాగ్రాహి, మొ॥ ముగ్గురు నత్తి పండితుల కుట్రలను అధిగమించుటకు కాళిదాసు చెప్పిన పద్యములుగా ప్రసిద్ధి.

ఇందు 'క్విప్' ప్రత్యయమును ఎక్కువగా వాడి కష్ట సంధులను సృష్టించి ప్రత్యర్థులయిన నత్తి పండితులను జయించినట్లు ఆభాణకము. కనుక ఇవి ప్రహేళికలు ప్రహేళికలలో అర్థచమత్కారము కన్న శబ్ద చమత్కారము ముఖ్యము. కనుక పాఠకులు ఇందలి సారమును ఎక్కువగా ఊహించుకొనరాదు. 'ఇంతేనా' అని తృణీకరింప రాదు. శబ్ద చమత్కారము తక్కువది కాదు. బహుకష్టసాధ్యము. అది ఫలప్రదము కావటము ముఖ్యము. చెరకుగడను మైసూరుపాకుతో పోల్చరాదు. మొక్కజొన్న కండెను 'కజ్జికాయ' గా ఊహింపవద్దు.

6) ఇక "షడ్జామడ్జ" అను ద్వితీయ శ్లోకమునకు సవరణ ఎక్కువగా చేయవలసి వచ్చినది. గతానుగతికంగా ప్రజావదన పరంపరలో నాని ఆ శ్లోకము మరింత అక్షర స్ఖలితమయినది. రూపురేఖలు గుర్తించటం చాల కష్టమయినది. పైగా దీనికి రెండు పాఠములు లభించినవి. అందు మొదటి పాఠము మరింత అభేద్యము. తల, తోక తెలియటమేలేదు. రెండవ పాఠము ('ప్రఖ్యాత సఖ్యోదయౌ – అని చివరలో గల పాఠము) కొంచెము మేలు. దానిని అవసరమయినంతగా సవరించి ఒక రూపు, అర్థము తెచ్చినాను. అది ఎంతవరకు అసలు పద్యమునకు దగ్గరగా నున్నదో పాఠకులే చెప్పాలి.

7) ఈ వ్యాఖ్యానములో పాటించిన విధానమిది.

1) ఉపలబ్ధమయిన పాఠము

2) పరిష్కృతమయిన పాఠము

3) పదవిభాగము

4) ప్రతిపదార్థము

5) తాత్పర్యము

6) విశేషములు

పాఠకులు, ఫోన్ సహృదయులు, గ్రహించెదరు గాక!

ఇట్లు - మీ

మేళ్లచెర్వు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

తెనాలి. 9908163627

శ్రీగురుభ్యో నమః

మొదటి శ్లోకము

ఉపలబ్ధ పాఠము :

1) వాశ్చారేద్ధ్వజదగ్ధతోద్వధిపతిః కుద్రేడ్జ జానిర్గణే
డ్గోరాదారురుదురస్సరేదు రుతర గ్రైవేయకభ్రాడరం ।
ఉడ్వీద్ధృజ్ఞరకాస్థి ధృక్త్రిదృగిభే దార్ద్రాజినాచ్ఛాదన
సస్యాదంబునుదంబుదాళి గళరుద్దేవో ముదేవోమృడః ॥

పరిష్కృత పాఠము :

వాశ్చారేద్ధ్వజధగ్ ధృతోద్వధిపతిః కుద్రేడ్జజానిర్గణే
డ్గోరాదారురుదురస్స రేదురుతర గ్రైవేయకభ్రాడరమ్ (భ్రాడురాఃు)
ఉడ్వీద్ధృజ్ఞర కాస్థిధృత్ త్రిదృగిభే దార్ద్రాజినాచ్ఛాదనః
సస్యాదంబునుదంబుదాభగళ రుద్దేవో ముదే వో మృడః ॥

పదవిభాగము :

వాశ్చారేట్+ధ్వజధక్, ధృతోద్వధిపతిః, కుద్రేడ్జ జానిః, గణేట్, గోరాదారురుట్, ఉరస్సరేదురుతరగ్రైవేయక (భ్రాడురాఃు) భ్రాట్+అరం, ఉడ్వీట్+ దృక్, నరకాస్థిధృత్, త్రిదృగ్, ఇభేదార్ద్రాజినాచ్ఛాదనః, సః, స్యాత్, అంబు నుదంబుదాభగళరుక్, దేవః, ముదే వః మృడః

ప్రతిపదార్థము :

వాఃు= నీటియందు, చార= సంచరించునట్టి, జంతువులకు, ఈట్= ప్రభువయిన మకరము, ధ్వజ= జెండాగాగల మన్మథుని, ధక్= దహించినవాడు, ధృత ధరింపబడిన, ఉడుపతిః = నక్షత్రపతి అయిన చంద్రుడు గలవాడు, కుద్ర = పర్వతములకు, ఈట్= ప్రభువయిన హిమమంతునికి, జ= పుట్టిన గౌరి, జానిఃు= భార్యగా గలవాడు, గణ= ప్రమథగణములకు, ఈట్= ప్రభువయినవాడు, గోరాట్= గోపతి అయిన నందిని, ఆరుట్= ఆరోహించువాడు, ఉరస్సర= ఉరగములయిన

పాములకు, ఈట్= ప్రభువయిన వాసుకి, యనబడు, ఉరుతర= పెద్ద, గ్రైవేయక = కంఠహారముతో, భ్రాట్ – ప్రకాశించు, ఉరాః = వక్షస్థలముగల వాడు, లేదా భ్రాట్=ప్రకాశించువాడు (అరం= శీఘ్రముగా – ఇది తరువాత క్రియతో అన్వయము), ఉడు= నక్షత్రములకు, ఈట్= ప్రభువయిన చంద్రుడు, దృక్= నేత్రముగా గలవాడు, నర= మనుష్యులయొక్క, క= శిరస్సుయొక్క లేదా బ్రహ్మయొక్క అస్థి= ఎముకలను, కపాలమును, ధృత్= ధరించువాడు, త్రిదృక్= నేత్రత్రయము గలవాడు, ఇభేట్= గజాసురునియొక్క, ఆర్ద్ర= రక్తము స్రవించు, అజిన= చర్మమే, ఆచ్ఛాదనః= ఉత్తరీయముగా గలవాడు, అంబు= నీటిని, నుత్= వదలునట్టి, అంబుద= మేఘముతో, ఆభ= సమానమయిన, గళరుక్ = కంఠచ్ఛాయ గలవాడు అయిన, సః= ఆ, మృడః దేవః= శివదేవుడు, వః= మీ యొక్క, ముదే – సంతోషమునకు, స్యాత్= అగుగాక!(అరం శీఘ్రముగా అగు గాక!)

తాత్పర్యము : మకరధ్వజుడయిన మన్మధుని భస్మము కావించినవాడు, చంద్రకళాధరుడు, హైమవతీపతి, ప్రమధగణనియంత, వృషభారూఢుడు, ఉరగరాజు వాసుకిని కంఠహారముగా ధరించినవాడు, చంద్రనేత్రుడు, నరకపాలములను బ్రహ్మకపాలమును ధరించినవాడు, త్రిణయనుడు, గజాసురుని రక్తచర్మమునుత్తరీయముగా ధరించినవాడు, వర్షమేఘమువలె నల్లని ఛాయగల కంఠము గలవాడు అయిన ఆ పరమశివుడు శీఘ్రమే మీకు సంతోష ప్రదుడుగుగాక!

విశేషములు :

1) ఈ శ్లోకములన్నింటియందు ధాతువుల క్విప్ ప్రత్యయాంతరూపములు వాడబడినవి. దానివలన క్లిష్టసంధులు, అర్థక్లేశము వచ్చినవి. సభలో కవికి కావలసిన ప్రయోజనము సిద్ధించినది.

ఈశధాతువు – క్విప్ – ఈట్,
ఆరుహ్ – క్విప్ – ఆరుట్,
రాజ్, భ్రాజ్ – క్విప్ – భ్రాట్, రాట్,
ధృ – క్విప్ – ధృత్

దహ్=ధక్, ను – క్విప్ – నుత్

రుచ్– క్విప్ – రుక్

ఇలాగే మిగిలిన శ్లోకములందును చూచికొనవలసినది.

2) భ్రాడురాః – సరి. కాని ఉపలబ్ధ పాఠములో 'అరం' (అనగా శీఘ్రముగా) ఉన్నది గనుక దానికిగూడా అన్వయము చూపబడినది.

3) నర= నరులయొక్క, క = బ్రహ్మయొక్క అని అర్థము చెప్పవలెను. నరకపాలములు, బ్రహ్మకపాలము గలవాడు శివుడు.

కం = మెడ (కంధర – శిరము ధరించునది)

చూ॥ కం శిరోంబు సుఖే క్లీబం"

కః = బ్రహ్మ కో బ్రహ్మణి సమీరాత్మయమ దక్షేషు భాస్కరే – మేదినీ

రెండవ శ్లోకము

ఉపలబ్ధ పాఠము – 1

షడ్జామడ్జకరాడ్జ వీడ్జన సుధాడ్జాలంబుధడ్జాఖరే,
యద్యఃు, ఖడ్గధరేధరే ఖణఖణే ఖర్జూర లుడ్భ్రాభ్రమఃు,
లుడ్భ్రాయాస్పద యడ్గ డడ్గ డడడా షడ్గడ్గ డడ్గడ్గహా
షడ్జానఃు పురచాతురస్సుర గణేశద్యోతి విద్యోదయఃు ॥

ఈ పాఠము చాల దుర్బేధ్యముగ నున్నది. ఏ పదమూ తన అసలు స్వరూపమును మూలధాతువును ప్రత్యయమఱును తెలియనీయుటలేదు. గతానుగతికముగా జరిగిన ఉచ్చారణలలో అలా అక్షరమఱులు మారియుండవచ్చును. కనుక దీనిని వ్యాఖ్యానించుట లేదు.

ఉపలబ్ధ పాఠము - 2

షడ్జామడ్జ ఖరాడ్జవీడ్జ వసుధాడ్జాలాంశ్చ మడ్ఖాఖరే
జడ్చట్కిట్కి ధరాడ్ధరేడ్ఘనఘనః ఖడ్జోత వీడ్యడ్ర్భ మా
వీడ్యాలుడ్ర్భమలుట్ర్పయట్ర్పయ పదా డడ్గడ్గ డడ్గడ్గ హో
పాదౌ టేట్ర్ప టటట్ర్పటట్ర్పటరస ట్ర్పఖ్యాత సఖ్యోదయః

ఈ పాఠముగూడ దురన్వయముగానే యున్నది. పాదౌ, ప్రఖ్యాత... తప్ప అర్థమిచ్చిన పదములు కనబడలేదు. అసలు దీని ఇతివృత్తమేమిటన్నది తెలియటం కష్టమయినది. అయినను కొంతవరకు దీనిని అచ్చటి ధ్వని కనుగుణముగా సాధ్యమయినంత మేరకు సవరించితిని. దానిని పరిష్కృత పాఠముగా ఇచ్చుచున్నాను.

దీని విషయములో

వర్ణితవస్తువునుబట్టి ఆలోచించెదము. ఈ శ్లోకములందు 2 శ్లోకములు శివవర్ణన మరి 2 శ్లోకములు కేశవవర్ణన జరిగినది. పాదములవర్ణన ఒక్క శ్లోకమునందే యున్నది. దీనిని రెండవ శ్లోకము గాక ఐదవ శ్లోకముగా భావించుట యుక్తము. లేదా పాదాది స్తుతిగా ప్రథమ శ్లోకముగావలెను. లేనట్లయితే శివవర్ణన తరువాత శివపాదవర్ణన తరువాత విష్ణువర్ణన మరల ఒక పద్యములో శివవర్ణన గనబడుచున్నది. ఇది సరయిన వరసకాదు.

కనుక శివవర్ణన శ్లోకములు తరువాత కేశవవర్ణన శ్లోకములు తరువాత ఉభయుల పాదవర్ణన శ్లోకము ఉండుట సమంజసము. ఏదయినా పాదవర్ణన శ్లోకము '5' కావచ్చు ననుట యుక్తము.

కనుక యీ శ్లోకమునందు ఎవరి పాదములన్న విశేషము సూచింపబడలేదు.

శివుని నటరాజ నృత్యము, ప్రళయ నృత్యము, కృష్ణుని కాళీయ నృత్యము వామనుని మూడడుగుల విన్యాసము గాని కావచ్చును. నా దృష్టిలో త్రైలోక్యములను ఆక్రమించిన వామన పాదన్యాసము శివుని ప్రళయ నృత్యము లేదా సంధ్యాకాల నృత్యము కావచ్చును.

పరిష్కృత పాఠము :

షడ్జామడ్జ ఖగాబ్జవీడ్జ వసుధేడ్బాలాశ్చ। మగ్నాదరే,
జడ్జట్కిట్కిధరో ధరేడ్ఘనధనః ఖద్యోత ఈడ్యభ్రమః,
విద్యాలడ్భమలు ట్రుయత్రియపదే డడ్గడ్గ డడ్గడ్గహౌ
పాదౌతే ట్రుటట ట్రుటట్ప్రటరస ప్రఖ్యాత సఖ్యోదయౌ

పదవిభాగము :

షడ్జామృడ్జఖగాబ్జవీడ్జ వసుధేడ్బాలాఃచ, మగ్నాఃదరే, జడ్జట్కిట్కిధరఃధరేట్, ఘనఘనఃఖద్యోతఃఈడ్యభ్రమఃవిద్యాలడ్భమలుట్రుయత్రియపదే, డడ్గడ్గ డడ్గడ్గహౌ । పాదౌతే ట్రుటటడ్రుటట్ప్రటరస ప్రఖ్యాతసఖ్యోదయౌ ।

ప్రతిపదార్థము :

షడ్జ= షణ్మాతురుడయిన కుమారస్వామి, ఆమృట్ = నలుగుపిండి (యౌగికార్థము) నుండి, జ= పుట్టిన గణపతి, ఖగ = దేవతలు, అబ్జవీట్= పద్మనేత్రుడయిన హరియొక్క, జ= కుమారుడయిన బ్రహ్మయు, వసుధేట్ = భూపతులున్ను, బాలాశ్చ = బాలులును, దరే= భయమునందు, మగ్నాఃమునిగిరి, ఘనధనఃగొప్ప ధనముగల లేదా ధనమైన, ధరేట్= పర్వతము (మేరువు, కైలాసము) జడ్జట్కిట్కి= మూలములు కదలుచున్న శబ్దములు, ధరఃకలదయినది. (గిరులు ఊటాదినవి), ఖద్యోతఃసూర్యుడు, ఈడ్య= చెప్పుకొనదగిన, భ్రమఃకంపము గలవాడయ్యెను. (అనగా అల్లాడెను), విద్యా= జ్ఞానమును, లట్ = అభిలషించువారి భ్రమ= భ్రాంతులను, లుట్= పోగొట్టునట్టివియు, ప్రయత్= ప్రకృష్టమయిన యానము చేయువారికి అనగా మోక్షగాములకు, ప్రియ= ప్రియమయిన, పదే= స్థానములుగా అయినవి, డడ్గడ్గ డడ్గడ్= భయముతో గజ గజలాడుచున్న (భయమునకు అనుకరణధ్వని) గ్రహౌ = నవగ్రహములు గలవియు,

ట్రుటటట్రుటట్రుట = ప్రటటట్మొ మద్దెల ధ్వనులవంటి, రస= ధ్వనులతో, ప్రఖ్యాత= ప్రసిద్ధమయిన సఖ్యోదయౌ = స్నేహవృద్ధి గలిగిన, తే= నీ (హర/హరి), పాదౌ= పాదములు మమ్ములను రక్షించుగాక! లేదా.

తే = క్రీడాసంబంధమయిన, ట్రుటటట్రుట – ధ్వనులు గలపాదములు రక్షించు గాక!

తాత్పర్యము : శ్రీహరిపాదములు లేదా శ్రీహర పాదములు లేదా శ్రీధర / హరిహర పాదములు మనలను రక్షించుగాక! అవి నృత్యము చేయుచున్నవి లేదా భూనభో భాగములను ఆక్రమించుచున్నవి. ఆనందర్భమున కుమార గణేశ బ్రహ్మాది దేవతలు, భూమియందు రాజుల నుండి బాలులదాక అందరు భయమగ్నులయిరి. మేరు పర్వతము లేదా కైలాస పర్వతము ఆ సంభ్రమ సన్నివేశమున పెకలింపబడినట్లు ధ్వనులు చేయుచు (జట్ కిట్ – ఇలా) ఊగినవి. సూర్యుడు స్పష్టముగా కంపించెను. జ్ఞానాభిలాషులకు భ్రమను పోగొట్టు ఆ పాదములు అట్టి మోక్షగాములకు ప్రియస్థానములు. వాటినిచూచి రవ్యాది గ్రహములు దడదడలాడినవి (డడ్డడ్డ...) దేవతల ఆనంద వాద్య ధ్వనులయిన ట్రుటటట్రుటట్ – వంటి ధ్వనులతో ఆ పాదములు నృత్యక్రీడలో స్నేహము చేసినవి.

అనగా వాద్యములకు అనువుగా అడుగులు బడినవి. అట్టి పాదములు మిమ్ము రక్షించు గాక!

విశేషములు – 1) ఆమృట్ = ఆ = అంతట, మృట్ శుద్ధి చేయునది =ఆ మృట్ అనగా నలుగు – ఇది రూఢ పదము కాదు. వ్యుత్పత్తి ద్వారా వచ్చిన క్లిష్టపదము. ప్రహేళికలలో ఇట్టి ప్రయోగములు సంభవము. పార్వతి నలుగు పిండి నుండి పుట్టినవాడు గణపతి.

2) వీట్ = వి+ఈక్ష – ధాతువుకు క్విప్ – వీక్షించునది – కన్ను, అబ్జవీట్ = కమలలోచనుడు – విష్ణువు, ఆయన కొడుకు బ్రహ్మ.

3) ధరః= పర్వతము "ధరాపృథ్వీ, ధరోగిరిః" – త్రికాండశేషము.

"ధరోగిరౌ = మేదిని

4) ఘనధనః = ధనమనగా వెండి బంగారములు గదా! అట్టి ధనము గల లేదా, ధనమయిన పర్వతము మేరువు. అది త్రివిక్రముని పరాక్రమ సందర్భమున

ఊగినది. కైలాసము వెండి కొండే. అది శివతాండవ సందర్భమున కిర్రు కిర్రున కదలిపోయినది.

5) లట్ = లష కాంతౌ – క్విప్, లుట్ – లుఠ ప్రతీఘాతే – క్విప్

6) ప్ర – యత్ – ఇణ్ ధాతువుకు శతృ ప్రత్యయము.

7) తే = తే శబ్దః క్రీడనే స్త్రీస్యాత్ క్రీడకేత్వభిధేయ వత్ – నానార్థ రత్నమాల కనుక 'తే' అనగా ఆట, ఆడువాడు.

8) రసః = రసితం = శబ్దము.

"ఆస్వాదన, ధ్వని, సుధాంబు రసాఖ్య ధాతుష్వి ష్టోరసః – నానార్థ రత్నమాల.

మూడవ శ్లోకము

ఉపలబ్ధ పాఠము

దైత్యేడ్ధ్వజివీడ్ధృతాద్రి రఘుధగ్ధర్మ ప్రరీడ్విశ్వసృ
డ్రక్షః ప్రేక్షణపేర్ధనుర్దధృగిభేడ్రట్కై డభద్వి డ్రమేట్
దేవేడీడిత పత్పునాతువిగహే దారుడ్దయావాడ్విరా
ట్స్వర్విడ్రుగ్భహురుడ్రిపౌహ్యు డుపభేడ్రుబ్జడ్వరడ్విభుః

పరిష్కృత పాఠము :

దైత్యేడ్విట్ ధ్వజవీడ్ధృతాద్రి రఘుధగ్ ధర్మప్రరీ (ర) డ్విశ్వసృట్
రక్షః ప్రేక్షణ భీర్ధనుర్దధృగిభేడ్రట్ కైటభద్విడ్రమేట్,
దేవేడీడితపత్పునాతు విహగే దారుట్ దయావాడ్విరాట్,
స్వర్విడ్రుగ్భహురుడ్రిపౌహ్యుడుపధే డ్రుబ్జ్ఞ డ్వరత్విడ్విభుః

పదవిభాగము :

దైత్యేట్+ద్విట్, ధ్వజవీట్, ధృతాద్రిః, అఘుధక్, ధర్మప్రరీట్ (ధర్మప్రరట్), విశ్వసృట్, రక్షః ప్రేక్షణభీః, ధనుర్దధృక్, ఇభేడ్రట్, కైటభద్విట్, రమేట్, దేవేడీడితపత్,

పునాతు, విహగేడారుట్, దయావాట్, విరాట్, స్వర్ద్విట్+ధ్రుక్, బహురుట్, రిపౌ, హి, ఉడుపథేద్రుజ్మ్రుద్వరత్విట్, విభుః.

ప్రతిపదార్థము :

దైత్యేట్=దైత్యనాయకులకు, ద్విట్= శత్రువయినవాడు (దైత్యారిః పుండరీకాక్షః) ధ్వజముగా అయిన, వీట్= పక్షినాధుడయిన గరుత్మంతుడు గలవాడు, ధృత= ధరింపబడిన, అద్రిః= గోవర్ధన పర్వతము, మందర పర్వతము గలవాడు, అఘు= అఘాసురుని, లేదా, పాపములను, ధక్= దహించువాడు, ధర్మప్రరి= ధర్మ సంపన్నులకు, ఈట్ ప్రభువయినవాడు లేదా ధర్మ= ధర్మమునకు, ప్ర= గొప్ప, రట్= రక్షకుడు, విశ్వసృట్= విశ్వసృష్టికర్త, రక్షః= రాక్షసులయొక్క, ప్రేక్షణ= నేత్రములకు, భీః= భయకరుడు లేదా, బెదురు కలిగించువాడు, లేదా భయము కలిగించునట్టి, ధనుః= శార్ఙ్గమను ధనుస్సుతో, దధృక్= గర్వముగా నుండువాడు, ఇభేట్= గజేంద్రుని, రట్= రక్షించినవాడు, కైటభ= కైటభాసురునియొక్క, ద్విట్= శత్రువయినవాడు, రమా= లక్ష్మికి, ఈట్= ప్రభువయినవాడు, దేవేట్= దేవేంద్రునిచేత, ఈడిత స్తుతింపబడిన, పత్= పాదములు గలవాడు, విహగేట్= పక్షీంద్రుని, ఆరుట్= ఆరోహించువాడు, దయా= దయను, వాట్= ప్రవహించువాడు, విరాట్= సర్వత్ర విరాజిల్లువాడు, స్వః= స్వర్గమునకు, ద్విట్ = శత్రువులయిన రాక్షసులకు, ధ్రుక్= ద్రోహము చేయువాడు, రిపౌ= శత్రువునందు, బహురుట్= అధిక రోషము గలవాడు, ఉడుపథ= తారా పథమునకు, ఈట్= ప్రభువయిన చంద్రునియొక్క, రుక్= కాంతిని, మృట్= శుద్ధి చేయగల, వర= గొప్ప, త్విట్= కాంతిగల

విభుః = ప్రభువు ("హి" పదం పూరణము) అయిన విష్ణువు మీకు సంతోషకరుడగు గాక. (ప్రథమ శ్లోకమునుంచి అనువృత్తి)

తాత్పర్యము : దైత్యాంతకుడు గరుడధ్వజుడు గోవర్ధనమును ఎత్తిన కృష్ణుడు. మందరమును నిలిపిన కూర్మావతారుడు. అఘాసురుని చంపిన కృష్ణుడు అఘములను అనగా పాపములను తగులబెట్టు విష్ణువు. ధర్మమును ధర్మసంపత్తిగలవారిని పాలించు ఈశ్వరుడు విశ్వనిర్మాత, రాక్షసులకు దుర్నిరీక్ష్యుడు, లేదా రాక్షసనేత్ర భయంకరమయిన

శార్ఙ్గ ధనుస్సుతో గర్వించు వీరుడు, గజేంద్ర రక్షకుడు, కైటభ మర్ధనుడు, రమావల్లభుడు, దేవేంద్ర పూజితపాద పద్ముడు, గరుడ వాహనుడు, దయామయుడు, సర్వతో విరాజమానుడు, స్వర్గద్వేషులకు ద్రోహకరుడు, శత్రుంతపుడు, చంద్రకాంతిని గూడా శుద్ధిచేయగల నిర్మలకాంతి విరాజితుడయిన విష్ణుదేవుడు మీకు సంతోషము కలిగించు గాక!

విశేషములు :

1) ధ్వజ= అనగా ధ్వజముగా అయిన అని అర్థము. ధ్వజ ఇవాచరతి = ధ్వజతి ధ్వజవీట్ – ఆచారార్థకక్విప్, వీట్ = వి – పక్షులు – ఈట్. వాటికి ప్రభువు గరుడుడు.

2) ప్రరి – ప్రకృష్టమయిన 'రైఃʼ ధనముగల కులము సమూహము – ప్రరి. అట్టి దానికి ఈట్. చూ – కౌముది – అజంత నపుంసకం.

3) భీఃʼ = భయము ప్రసిద్ధపదము – లేదా భృ– భర్త్సనే, భరణేచ – క్ర్యాది దీనికి క్విప్ – గీఃʼ – లాగా.

4) దధృక్ = ధృషా ప్రాగల్భ్యే – దీనికి 'ఋత్విక్ దధృక్" – అను సూత్రంలో నిపాత మొ॥

5) దహ – ధక్ – క్విప్,
రక్ష – రట్ – క్విప్,
వహ – వాట్ – క్విప్
ద్రుహ – ద్రుక్ – క్విప్
మృజా – మృట్ – క్విప్

నాల్గవ శ్లోకము

ఉపలబ్ధ పాఠము

"తిగ్మత్విత్సితరుద్సుదృగ్యుగద ధృక్షో ధృక్షగబ్జాక్షియు
గ్పక్ష్యారుట్ఫణిరాట్ఛయేద్ధృత మహేభృద్భ్రాణ్మహా చక్రవాట్,
పాయాన్నోఘధగంబు ముగ్ఘనరుచి ర్ద్యోద్విడ్ధ్వదజ్జోష్ఠ వి
ధ్భక్తాభీష్టదకామధుగ్ఘననసుద్బ్రహ్మాండ రట్శ్రీ విరాట్"

పరిష్కృత పాఠము :

తిగ్మత్విట్ సితరుక్సుదృగ్యుగల ధృద్వక్షోధృతా బ్జాక్షియుక్,
పక్ష్యారుట్ఫణిరాట్ఛయో ధృతమహీభృద్భ్రాణ్ మహాచక్రవాట్,
పాయాన్నోఘధగంబుముగ్ఘనరుచిః ద్యోద్విడ్ధ్వ దబ్జోష్ఠవిత్
భక్తాభీష్టదకామధుక్ భువనసృట్ బ్రహ్మాండ రట్ శ్రీవిరాట్ ॥

పదవిభాగము :

తిగ్మత్విత్సితరుక్సుదృగ్యుగలధృత్, వక్షోధృతాబ్జాక్షియుక్, పక్ష్యారుట్, ఫణిరాట్ఛయః, ధృతమహీభృత్, భ్రాట్, మహాచక్రవాట్, పాయాత్, నః, అఘధక్, అంబుముగ్ఘనరుచిః, ద్యోద్విడ్ధ్వట్, అబ్జోష్ఠవిత్, భక్తాభీష్టదకామధుక్, భువనసృట్, బ్రహ్మాండరట్, శ్రీవిరాట్.

ప్రతిపదార్థము : తిగ్మత్విట్ = సూర్యుడు, సితరుక్= చంద్రుడు అను, సుదృక్= మంచి నేత్రముల, యుగళ= జంటను, ధృత్= ధరించినవాడు, వక్షః = ఛాతీచేత, ధృత = ధరింపబడిన, అబ్జాక్షి= కమలాక్షి అయిన లక్ష్మితో, యుక్= కలిసినవాడును. పక్షి= పక్షిని, ఆరుట్= ఆరోహించినవాడును, ఫణిరాట్= సర్పరాజయిన ఆదిశేషుని యందు, శయః= శయనించువాడును, ధృత= ధరింపబడిన, మహీభృత్= గోవర్ధన, మందరములు లేదా ధర్మరాజాది రాజులు గలవాడును, భ్రాట్= ప్రకాశించు వాడును లేదా వెలుగుచున్న, మహాచక్ర= సుదర్శన చక్రమును, వాట్= వహించిన వాడును, అఘధగ్= అఘాసురుని, అట్లే, పాపములను, ధృక్= దహించువాడును, అంబుముక్= వర్షము కురియునట్టి, ఘన= నల్లమబ్బువంటి, రుచిః= కాంతి గలవాడును, ద్యో=

స్వర్గమునకు, ద్విట్= శత్రువులయిన రాక్షసులకు, ధ్వత్= ధ్వంసకుడు, అబ్జా = జలజ అయిన లక్ష్మియొక్క, ఓష్ఠ= అధరోష్ఠ మాధుర్యమును, విత్= ఎరిగినవాడును, భక్త= భక్తుల అభీష్ట = ఇష్టములను, ద= ఇచ్చునట్టి, కామధుక్= కామధేనువు, భువనసృట్= లోక నిర్మాతయును, బ్రహ్మాండ = బ్రహ్మాండములకు, రట్= రక్షకుడు, శ్రీ= లక్ష్మితో, విరాట్= విరాజమానుడున్న అయిన విష్ణుదేవుడు, నః= మనలను, పాయాత్= రక్షించుగాక.

తాత్పర్యము : తీక్ష్ణకాంతిగల సూర్యుడు, ధవళ కాంతిగల చంద్రుడు విష్ణునేత్రములు వక్షస్థలాలయ అయిన భార్య గలవాడు. పక్షివాహనుడు ఫణిరాజ శయ్యగలవాడు, పర్వతధారి, గిరిధరుడు, ప్రకాశవంతమయిన చక్రమును ధరించినవాడు.

అఘాసుర మర్దనుడు, పాపధ్వంసకుడు వర్షమేఘ సమానకాంతి గలవాడు, నీలమేఘశ్యాముడు, స్వర్గద్వేషులను ధ్వంసము చేయువాడు, రమావల్లభుడు (రమా చుంబన ప్రియుడు) భక్తవాంఛలను తీర్చు కామధేనువు, భువనకర్త, బ్రహ్మాండ రక్షకుడు, శ్రీ విరాట్టు అయిన విష్ణువు మనలను రక్షించుగాక!

విశేషములు :

1) ధృఞ్ ధాతువు – క్విప్ – ధృత్,
యుజ్ – క్విప్ – యుక్,
భ్రాజ – క్విప్ – భ్రాట్,
ముచ్ – క్విప్ – ముక్,
దుహ – క్విప్ – ధుక్,
ధ్వంస – క్విప్ – ధ్వత్
విద – వింద – క్విప్ – విత్
సృజ – క్విప్ – స్రట్,
రుచ – క్విప్ – రుక్

ఐదవ శ్లోకము

ఉపలబ్ధ పాఠము

శుందాలేడ్ద్విద నీలకాండ వినుతో వీట్కాండ కాండో వృషే
ట్కాండః కాండజకాండ కాండ ధరజి ద్భేట్టుండ చూడామణిః
శుందాలాస్య షడాస్య సేవ్యచరణం సౌఖ్యం శివస్సాదరమ్
దద్యాదద్య సకాండ కాండదగళ త్సిట్కుండ లీట్కుండలీ

పరిష్కృత పాఠము :

శుందాలేడ్ద్విడనీలకాండ వినుతో వీట్కాండ కాండోవృషే
ట్కాండః కాండజకాండ కాండ ధరజిత్ భేట్టుండ చూడామణిః
శుందాలాస్య షడాస్య సేవ్యచరణః సౌఖ్యం శివః సాదరం,
దద్యాదద్య సకాండకాండదగళ త్విట్కుండ లీట్కుండలీ ॥

పదవిభాగము :

శుండాలేడ్ద్విట్, అనీలకాండ వినుతః, వీట్కాండకాండః, వృషేట్కాండః, కాండజ, కాండ కాండ ధరజిత్, భేట్టుండచూడామణిః, శుండాలాస్య షడాస్య సేవ్యచరణః, సౌఖ్యం, శివః, సాదరం, దద్యాత్, అద్య, సకాండ కాండద, గళత్విట్, కుండలీట్కుండలీ ॥

ప్రతిపదార్థము :

శుండాల= ఏనుగుల యొక్క, ఈట్= ప్రభువయిన గజాసురునకు, ద్విట్= శత్రువయినవాడు, అనీల= తెల్లని, కాండ= వాహనముగాగల బ్రహ్మచేత, వినుతః= స్తుతింపబడినవాడు, వీట్ = పక్షిరాజు, కాండ= వాహనముగాగల విష్ణువు, కాండః = బాణముగా గలవాడు (త్రిపురాసుర సంహారము నందు శివునకు విష్ణువు బాణమయ్యెను), వృషేట్= వృషభరాజయిన నంది, కాండః, వాహనముగా గలవాడు, కాండ= నీటియందు, జ= పుట్టినవి, అనగా పద్మముల యొక్క, కాండ= సమూహమునే, కాండ= బాణముగా, ధర= ధరించిన మన్మధుని, జిత్= జయించినవాడు, భ=

నక్షత్రములకు, ఈట్= ప్రభువయిన చంద్రుని, ఖండ= కళ, చూడామణిః= శిరోమణిగా గలవాడు, శుండాలాస్య= గజాననునిచేత, షడాస్య= షణ్ముఖునిచేత, సేవ్య= సేవింపబడదగిన, చరణః= పాదములు గలవాడు, సకాండ= జలముగల, కాండద= మేఘముతో సమానమయిన, గళత్విట్= కంఠ చ్ఛాయగలవాడు, కుండలి= పాములకు, ఈట్= ప్రభువయిన అనగా శ్రేష్ఠమయిన నాగేంద్రులు, కుండలీ= కుండలములుగా గలవాడు, అయిన, శివః= శివుడు, అద్య= నేడు, సాదరం= ఆదరముగా, సౌఖ్యమ్= సుఖమును, దద్యాత్= ఇచ్చుగాక!

తాత్పర్యము :

గజాసురవైరి, హంసవాహనుడయిన బ్రహ్మచే స్తుతింపబడినవాడు, గరుడ వాహనుని బాణముగా చేపట్టి త్రిపురాసురులను వధించిన వాడును, వృషభరాజయిన నందిని వాహనముగా గ్రహించినవాడును, అరవింద సమూహమును బాణముగా గ్రహించి తనను ధీకొన్న మన్మధుని సంహరించిన వాడును, చంద్రార్ధ శేఖరుడును, గజముఖ షణ్ముఖ సేవిత చరణుడును వర్షమేఘ సమాన నీలకంఠుడును, నాగేంద్ర కుండల ధరుడును అగు ఆ శివుడు సాదరముగా మనకు సౌఖ్యము నిచ్చుగాక!

విశేషములు :

1) కాండ శబ్దమునకు చాల అర్థములు గలవు. వాహనము, బాణము, జలము, గుర్రము, సమూహము చూ॥ అమరం : కాండాస్త్రి దండబాణార్వ వర్గావసర వారిషు – ఇందులో అర్వ= వాహనము, వర్గ= సమూహం, చూ॥ నానార్థ రత్నమాల – ద్వ్యక్షర కాండము.

బాణావసర గ్రంథి స్తంబరహో వాజివారి వర్గేషు

2) భం = నక్షత్రము